మా పిచ్చి సుందరరామయ్య బావ మాటల్ని వింటూ ఆ రాత్రల్లా చెరోవైపు కూర్చున్నాం బొమ్మల్లా. అతని లైఫ్‌లోని ట్రాజిడీ నాకు తెల్సు. డెబ్భయ్ ఏళ్ళ మనిషి ఓ యిల్లూ నా అన్నవారులేకుండా కాకిలా తిరుగుతున్నాడు. మనిషిని కదిపితే ఆప్యాయం ముద్ద. బావ వెళ్ళిపోయినరోజు ఏడుస్తూ కూర్చున్నా. ఏడుస్తున్నావా అన్నారు. అవును, పెద్దవాడు మళ్లీ కనిపిస్తాడని నమ్మకమేవిటి? అన్నట్టు చెప్పడం మరిచా. అతని మూడో బావమరిది కాంగ్రెస్ ఎమ్మెల్యే. కంట్రాక్టరు. చిట్టివెంకటలక్ష్మి హైదరాబాద్‌లో స్థలాల్ని కొని మళ్ళీ అమ్మి లక్షలకు లక్షలు గడించింది.ఆవిడ యిప్పుడు గొప్ప దైవభక్తురాలు... చీటీ యిస్తే గవర్మెంటులో ఏ పనైనా ఎవరైనా యిట్టే చేసిపెడతారు. మా బావయ్య అప్పటికీ యిప్పటికీ గాంధీ పిచ్చోడు. కాంగ్రెసు వారు యిచ్చిన భూమికి పన్నుకట్టలేకపోతే ప్రభుత్వం వారు కలిపేసుకున్నారు.

తలకు బంకమట్టి పట్టించుకుని గుండ్రాయితో ఒళ్లు రుద్దుకుంటూ కాంగ్రెసుని తిట్టుకుంటూ, డబ్భై ఏళ్ళ ముసలి భక్తుడెవరైనా కనిపిస్తే అతను తప్పకుండా మా పిచ్చి సుందరరామయ్య బావే అని గుర్తుంచుకోండి.

# రచయిత్రుల తెలుగు

**యాం**డీ గురూ గారూ! హనుమాయమ్మల నవల్స్ రెండు చదివాను అందం రైటా. రెండు హనుమాయమ్మల నవల్సుచదివాను అందం రైటా అని మా వార్ని నచకేతుడు యముడ్ని అడిగినట్టు దేహవంతా సందేహాల్తో నిండిపోయి తహతహలాడ్తూ ప్రశ్నించాను.

"ఛీ అవతలికి పో సీరియల్దానా!" అని వారు ఛీత్కారంచేశారు. నేను సీరియల్స్ తెగ చదువుతాననీ సీరియల్స్ తప్ప (బంగాళాదుంపకూర తప్ప మరోటి ముట్టనని ప్రమాణంచేసినట్లు) మరోటి ముట్టననీ, అంచేత నేను చెడిపోయానని మావారి థీరీ. నా ఆలోచన్లూ, నా భాషా, నా టేస్టూ నేను చదివే సీరియల్స్ వలన కండిషనై పోతాయని మా యముడిగారి తాత్పర్యం. సీరియల్స్ రాసే రచయిత్రులకి తెలుగురాదనీ, భాషరాదనీ, వాళ్ళుచేసే సాహిత్య సేవ సాహిత్యహింసాకాండ అనీ మావారికో స్పెషల్ ప్రెజుడిస్ వుంది. అది వాళ్ళనేమనలేక నామీద చూపిస్తుంటారు. నాకు బాగా తెలుగు రాదనుకోండి. మావారికీ రాదనే నా అభిప్రాయం. హి ఆల్సో డజ్నాట్‌నో – అనగా అతగాడిక్కూడా యంతమాత్రం తెలుగు తెలీదు. హనుమాయమ్మ నవల్స్‌మీద నేను మైసూర్‌పాక్ పందెంవేశాను. వాళ్ళకు తెలుగు రాదంటున్నారు గదా! మరివారు రాసేదంతా హాట్ కేక్స్‌లాగా చదువుతున్నారని చెప్పబడుతున్నది కదా. దీని భావమేమి తిరుమలేశ అని మా యముడిగార్ని నిలేసి అడిగాను. షటప్ అన్నారు. మీరే షటప్పు – పాప్యులర్‌గా రాస్తున్నందుకు మీరు ఉడుకు మోత్తనంకొద్దీ "టెల్గూ లాంగ్వేజీ" వారికి రాదని అంటున్నారుగాని

అది ప్యూర్ జెలసీతో కూడుకున్నటువంటి ముక్క అని నేను వార్ని కొంచెం గిల్లాను. గిల్లానంటే యాక్చువల్లీ గిల్లడంకాదు కొంచెంగోకాను. (అబ్బగోకడంకూడా కాదు) రెచ్చగొట్టాను. (ఛఛ రెచ్చగొట్టడం కాదు) ఆ ఆ ప్రొవోక్ చేశాను! ప్రొవోక్ చేయడవంటే మూలకూర్చున్న మనిషిని (మూలకూర్చోవడమంటే చెడ్డ అర్థంతోకాదు మహాప్రభో) గిల్లి రక్కిపీకి యీడ్చుకురావటం అన్నమాట. పైకి నేనప్పుడు తిరపతి వెంకటేశ్వరస్వామి మీద పందెం మొక్కు మొక్కాను. మీరు రచయిత్రులకు తెలుగురాదని రుజూచేస్తే జుట్టు తీయించుకోనక్కర్లేదు లేకపోతే తీయించుకోవాలని – ఆయన ఆవల్రైటుగా ఒప్పేసుకున్నారు. అప్పుడిహ ఇద్దరం వీక్లీలూ, మంత్లీలూ, పాకెట్ బుక్సూ అన్నీ తెచ్చి అందులోంచి రచయిత్రుల తెలుగురచన్స్ క్షీరనీరన్యాయ ప్రకారం వేరుచేసి నిష్పాక్షికంగా రెండు కళ్ళతోనూ చూసింది చూసినట్టు చదవదల్చుకున్నాము. మా యముడుగారు ట్రాప్‌లో పడ్డారుగదా అని నాకు సంతోషం వేసింది కాని రచయిత్రుల బండారం బైట పెడ్తున్నానని నాకప్పుడనిపించలేదు. మావారు చాకు పైకితీశారు. చెప్పొద్దూ – యీ రచన్స్ చదివితే అంత ఉద్రేకం వస్తుందని నేననుకోలేదుస్మీ! కాని నేనే అపార్థం చేసుకున్నాను కథల్లో నాయికలా – వారు పెన్సిల్ చెక్కుకుంటున్నారు. చెక్కుకోండి ఎవరి ఖర్మ వారిది. ఆ పెన్సిల్తో అక్కడాఅక్కడా కొన్ని వాక్యమ్సు అండర్‌లైన్ చేశారు. నన్ను స్టాండపాన్ది బెంచి అని అవి బిగ్గరగా చదవమన్నారు. చదువుతాను యముడుగారు చెప్పినట్లు – మీరు కూడా వినండి. ఇవి ఎవరి రచన్స్‌నుండో నాకైతే బాగా తెలీదుకాని హనుమాయమ్మనావెల్సు నుంచే అనుకుంటా–

హనుమాయమ్మ కోసం వెతక్కండి. హనుమాయమ్మ అనే రచయిత్రి ఫిజికల్‌గా లేదు. ఆవిడ ఒక సింబల్ – మీలోనూ, నాలోనూ ఈ చరాచర సృష్టియందంతటా అదృశ్యశక్తివలె వ్యాపించి యున్నది అని అనుకొందాం. బైదిబై కమింగ్ టు ది పాయింట్ – అండర్ లైన్ చేసిన వాక్యాలు చదువుతాన్చదువుతాన్వినండి.

"... ని కలుపుకునేందుకూ అతని సమక్షంలో హృదయాన్ని కడుగుకునే అవకాశమే లేకపోయింది. సాగర్‌డామ్ దగ్గర..." కథానాయికతరఫున రైటర్ చెప్తున్న వాక్యాలనిర్మాణం సొంపు యిది.

"అందాల అపరంజిముద్ద రాధ జీవితాన్ని స్వపరం కావించుకొని శరీరసుఖాన్ని పొందడంలో అతను యెంతో పెట్టిపుట్టినట్లు అనుభూతి పొందాడు." ఇది కథానాయకుడిగారి జుగుప్సాకరమైన అవస్థని రైటర్ వర్ణిస్తోంది. అప్పుడు కథానాయికిలా అంటుంది సార్! (అతని కౌగలి బిగించి వూపిరి సలుపనివ్వని క్షణంలో) "మీ పవిత్రమైన యీ బంధం నా పాపాల్ని యెత్తి చూపిస్తోంది. నేనెంత ద్రోహిని. ఈ క్షణంలోనైనా నిజం చెప్పేందుకు నోరు రావడంలేదు దేనికి? నా పాపాన్ని మీ ముందుంచి నీకెందుకు (నేనెందుకు అని వుండాలి) ప్రక్షాళనం చేసుకోలేకపోతున్నాను?" అని వాపోతుంది లోలోపలే రచయిత్రి కాదు కథానాయిక. రచయిత్రికి పశ్చాత్తాపంరాదు రాసిందల్లా అచ్చవుతున్నంత కాలం.

మరోచోట (వేసంకాల వర్ణన) యెండ వేడిమికి కొండల ప్రాంతాలు మరీ దారుణంగా వున్నాయి. సదాశివం మొహం కందదుంపలా వున్నది. (నాకు నవ్వొచ్చి బెంచీమీంచి కిందపడబోతే మావారు నన్ను పట్టుకుని మళ్ళీ తిన్నగా నిలబడి చదవమని ఆజ్ఞాపించారు. నేరక యీ కర్కోటకపు మనిషితో వాదనకుదిగానే అని నేను రచయిత్రుల తెలుగుకి మరికొన్ని అండర్‌లైన్ చేసిన వాక్యాలు చదవక తప్పేట్టులేదు) నాయికా నాయకులు అవస్థలో పడ్డట్టున్నారు. అప్పుడు వారి డైలాగులు -

"నన్ను నీ ఒళ్ళో పడుకోనివ్వు రాధా అసలీ జన్మలో నాకీ తృప్తి లభిస్తుందనుకోలేదు."

"ఛ! యేం మాటలవి?"

"లేదు రాధా నీకు తెలీదు. యేకాకిలా బ్రతుకుతూ అనామకం గానే చివరిక్షణంవరకూ గడపడం యెంతో కష్టం..."

(చదవడంకూడా మనకెంతో కష్టంగాలేదూ! ఈమె అరడజనుకు పైగా సీరియల్స్ రాసి, బహుమతులు పొందింది.) అదలాగుంచండి. రైటర్ కథానాయిక అనుకున్నట్లుగా ఎలా అనిపిస్తున్నదో ఆ వాక్యాల సొంపు చిత్తగిస్తారా పాఠకమహాశయా - చిత్తగించండి.

"చావు బ్రతుకులమధ్య పెండ్యులం మాదిరి వ్రేలాడే నేర్పు తనకి లేదు" (చావు బ్రతుకులమధ్య వేలాడటానికి నేర్పుకావాలా ఓర్పుకావాలా ఏవిటో ఈ మహారచయిత్రి అయోమయం?)

మరొకచోట -

కానీ ఈ దుర్మార్గుడు మంచివాడు కాడు. వీధి వీధి, వాడ వాడా నాలుక భుజానవేసుకుని తిరుగుతున్నాడు. (దుర్మార్గుడు మంచివాడెలాగవుతాడు? నాలుక భుజానవేసుకుని తిరగడమేవిటి?)

ఇంకో వాక్యం - ఆట్టే ఫరవాలేదనుకోండి. కాని చూడండి. "భార్యాభర్తలని రకరకాల కోణాల్లోంచి ఫొటోలు తీస్తున్నారు." (పాంప్ అండ్ షో వర్ణించడమన్న మాట యిది)

ఒక వేరే కథానాయిక తన మాజీ ప్రియునికి రాసే ఉత్తరంలోని వాక్యాలు...

"ఆయన ఆల్బంలో నీ ఫొటో చూశాను. యింటినిండా మీ యిద్దరి ఫొటోలే. నువ్వుకూడా నన్ను అనుభవించావనే వుద్దేశ్యం ఆయనకి వుంటే అది భరించలేరాయన" (రామ రామ ఏం తెలుగు? ఏ ఆడది యిలా రాస్తుంది తెలుగులో ఉత్తరం?)

మావారు నెగ్గారు. జుత్తు తీయించుకోనవసరంలేదనుకోండి. ఇందాక "సీరియల్దానా" అని నన్ను తిట్టారుకాని, యిప్పుడు నా మనసుకూడా పూర్తిగా పాడయిపోయింది.

అప్పుడు మేవిద్దరం తప్పుచేసినవారిలా చేతులుకట్టుకుని నిలబడి -

ఓరి దేవుడా!

మా జాతిని, మా భాషను, మా సంస్కృతిని, మా సాహిత్యాన్ని యీ "హింసాకాండ" నుంచి తప్పించి మమ్మల్ని (పాఠకుల్ని) కాపాడు అని కన్నీళ్ళతో ప్రార్థించాం. రచయిత్రుల తెలుగుకు మచ్చుతునకల్ని మీ ముందుంచి మీ బంగారుమనసుల్ని కూడా కంగారు పెట్టినందుకు నన్ను క్షమించాలి.

(హనుమాయమ్మలు - వాళ్ళు మంచి రైటర్స్‌కారని వాళ్ళకు తెలీక లోకంలో మంచి రైటర్స్ లేరనీ, మంచి రైటింగ్స్ రావటంలేదనీ వారు కూడా మొసలి కన్నీరు విడుస్తున్నారు. అసలలా మంచి రైటింగ్స్ రాక పోవడానికి వారిలాటి వారే కారణమని వారికి చెప్పే నాథుడు లేడు. క్షమించాలి - నాథుల్ని వారు కేర్ చేయరు). రచయిత్రుల తెలుగు చూశాక వీరు సంఘంగా వేరే వుండటమే మంచిదనే అభిప్రాయాన్ని మావారు వ్యక్తం చేశారు. రచయిత్రులు రంగంలోకి దిగాక తెలుగుతనం ఎక్కువయిందని అన్న శ్రీ శ్రీగారు పై వాక్యవిన్యాసాలను చూస్తే ఏమంటారో... ఎవరేమన్నా ఆడా మగా, డోకొచ్చే తెలుగు కథల్లోనూ, నవలల్లోనూ వ్రాయకుందురుగాక!

---

# "మా తెలుగుతల్లికి మల్లెపూదండ"

మన ఆంధ్రలో పల్లెటూళ్ళు తెలిసో తెలియకో సానిదానిలా షోకు చేసుకున్న శాస్తుర్లుగారి కూతుర్లా వుంటాయి. బైదిబై అప్పలరాజు గారి ఇంగ్లీషు మనవడ్ని పాలేరెంకట సుబ్బడి కూతురి కొడుకు బఫూన్లా ఇమిటేట్ చేసినట్లు. మన బెజవాడను, కోకోనాడాను, రాజమండ్రిని, విశాఖపట్నాన్నీ, చుట్టు ప్రక్కల వుండే బడుద్ధాయి గ్రామాలు కామాల్తో సహా "వూ" చేసి "వూహ్వా" ఇమిటేట్ చేస్తూంటాయి. కావాలంటే గోహ్‌బ్యాక్ టు విలేజస్- పట్నం వేసే పోకిరీ వేషాలన్నీ వేయటానికి విలేజస్ ట్రయి చేస్తూ వుంటాయి.

మరైతే దేశానికి నగరం ప్రేయసైతే గ్రామంతల్లిట. ప్రేయసులు తల్లులవుతారు. కొండొకచో తల్లులూ ప్రేయసు లవగల్రు. వైస్‌వెర్సా.

కమింగ్ టు ది సబ్జెట్ - కంట్రీ లైఫ్‌మీద మోజు తగ్గి టౌన్ లైఫ్ మరియు సిటీ లైఫ్ మీద మోజు పెరగడంతో, జాయింట్లన్నీ ఫట్ ఫట్ మని (ఆంధ్ర తెలంగాణ తగూల్లాగ) ఏకీలు కాకీలు విడిపోయాయి.

పట్టణ నాగరికతొచ్చిపడి మన కంట్రీలైఫ్‌మీద, మన ఓల్డుకస్టమ్స్ అన్నిటిమీద మాంఛి దెబ్బ తీసింది. పిల్లి పాలకుండ తిరగదోసినట్లు మన ట్రెడిషనల్ వాల్యూలన్నీ తిరగబడి నేలపాలయాయి. ది ట్రబుల్ యీజ్ - (కొత్త కోక కొనుక్కోకుండా పాత కోక విప్పి పారేసినట్టు) కొత్తవి పుట్టుకు రాకుండానే పాతవి పనికిరాకుండా పోయాయి. దేర్‌ఫోర్ అనగా....

వెనకటి రోజుల్లో అంటే బీసీనాటి మాటకాదు నే చెప్పేది. నిన్న మొన్నటి వరకూ ఆస్తిపాస్తుల్లేని హేండ్ టు మవుత్ సంసారాల్లో ఎన్నెన్నో ఇంటిబ్బందులున్నప్పటికీ, వ్యక్తులమధ్య డబ్బుకంటె ఆపేక్షలూ అంతఃకరణలది పైచేయిగా వుండేది. ఆంధ్రావాడి సొమ్ము అరవవాడు తినలేదా - తిన్నాడ్డిన్నాడు. నిన్న మొన్నటిదాకా తెలంగాణవాడి సొమ్ము ఆంధ్రావాడ్డిన్నాడయ్యా,